


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 321 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 10-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00



## అప్‌గ్రేడ్ అవ్వండి

**కొత్త నేరాలపై సరికొత్త అస్త్రాలు సిద్ధం చేయండి**

- దీనికోసం సీఎస్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ
- సైబర్, డ్రగ్స్, డార్క్ వెబ్‌ను ఎదుర్కొనేలా పోలీస్ వ్యవస్థ మారాలి
- అధికారుల పనితీరుకు ఏ, బీ, సీ గ్రేడింగ్..దాని ఆధారంగానే ఇకపై పోస్టింగ్‌లు
- 'మన్ కీ బాత్'లా వన్ సైడ్ వద్దు..పోలీసింగ్‌లో 'హ్యూమన్ టచ్' ముఖ్యం :
- 'ఫ్యూచర్ రెడీ పోలీసింగ్' సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

**హైదరాబాద్ మార్చి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయిందని, సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ లాంటి కొత్త సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పోలీసు వ్యవస్థ తక్షణమే సాంకేతికంగా 'అప్‌గ్రేడ్' కావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'ఫ్యూచర్ రెడీ పోలీసింగ్' రిట్రీట్ 2026 ముగింపు

-మిగతా 2 లో

# భారీగా బడ్జెట్ పద్దు

**ఈసారి రూ.3.15 లక్షల కోట్లు?**

- ప్రభుత్వం ప్రతిపాదించే అవకాశం
- తెలంగాణ రైజింగ్‌కు అనుగుణంగా ఆర్థిక శాఖ కసరత్తు
- ఆదాయం పెంచడమే లక్ష్యంగా సర్కారు ప్రణాళిక
- అమలు కానీ హామీలపై ప్రత్యేక దృష్టి



**హైదరాబాద్ మార్చి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ పద్దుపై కసరత్తు ప్రారంభించింది. అన్ని తరగతుల సంక్షేమం, అభివృద్ధి ఉండేలా పద్దులను కేటాయించే దిశగా సమాలోచన చేస్తున్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేటాయింపులు చేసే అవకాశమున్నది. ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలుకు అధిక ప్రాధాన్యత ఇవ్వబోతున్నది. ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేస్తున్నది. అమలు కాని హామీల కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. వాటి అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించినట్టు సమాచారం. ఈనెల 16 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబో తున్నాయి.

-మిగతా 2 లో



## ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రభావం

- కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత
- బెంగళూరులో రెస్టారెంట్ల మూసివేత!
- నేటి నుండి మూసివేస్తున్నట్లు వెల్లడి

**న్యూఢిల్లీ**
ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం బెంగళూరులోని రెస్టారెంట్లపై తీవ్రంగా పడింది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా ఎల్పీజీ సిలిండర్ల సరఫరా హఠాత్తుగా నిలిచిపోయిందని, దీంతో రేపటి నుంచి నగర వ్యాప్తంగా హోటళ్లను మూసివేస్తామని బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ పేర్కొంది. తీవ్ర కమర్షియల్ గ్యాస్ కొరత కారణంగా రేపటి నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను నిర్వహించలేమని ఆ ప్రకటనలో తెలిపింది. గ్యాస్ సరఫరా దాదాపు పూర్తిగా ఆగిపోయిందని, అందుకే తాము ఈ నిర్ణయం తీసుకుంటున్నామని వెల్లడించింది.

-మిగతా 2 లో




## బంగ్లాదేశ్‌లో దారుణం

- 16 ఏళ్ల హిందూ బాలుడి హత్య
- ఆటో దొంగతనాన్ని ప్రతిఘటించినందుకు శాంతో కుమార్ సాహా బలి
- ఢాకా-చిట్టగాంగ్ హైవేపై వాహనం కిందకు తోసి చంపిన దుండగులు
- ఫెనీ జిల్లాలో కలకలం: మైనారిటీలపై కొనసాగుతున్న దాడులు
- నిందితుల కోసం సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసుల గాలింపు

**న్యూఢిల్లీ**
బంగ్లాదేశ్ లో మైనారిటీలు అయిన హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఫెనీ జిల్లా లో ఆటోను దొంగిలించేందుకు యత్నించిన కొందరు దుండగులు.. 16 ఏళ్ల హిందూ బాలుడి ని దారుణంగా హత్య చేశారు. ఢాకా-చిట్టగాంగ్ హైవేపై లాల్‌పోల్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుందని అక్కడి మీడియా

-మిగతా 2 లో



## ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనీ ఎంపిక

- తండ్రి వారసుడిగా పగ్గాలు చేపట్టనున్న 56 ఏళ్ల మొజ్తాబా
- అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ కీలక నిర్ణయం: వ్యతిరేకత మధ్యే మెజారిటీ మొగ్గు
- లండన్‌లో రూ. 2,500 కోట్ల అక్రమ ఆస్తులు: బయటపడ్డ విలాసవంతమైన జీవితం
- మొజ్తాబా నియామకంపై మండిపడుతున్న అమెరికా, ఇజ్రాయెల్
- కొత్త లీడర్‌ను అంతం చేస్తామన్న ఇజ్రాయెల్ హెచ్చరికలు
- యుద్ధం మరియు అంతర్జాతీయ ఆంక్షల మధ్య ఇరాన్ నాయకత్వ మార్పు

**న్యూఢిల్లీ మార్చి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇరాన్ తమ దేశ నూతన సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. కొత్త సుప్రీం లీడర్‌గా అయతొల్లా ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. 56 ఏళ్ల అయతొల్లా సయ్యద్ మొజ్తాబా హొస్సేని ఖమేనీ అలియాస్ మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌కు మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యాడు. మొజ్తాబాను ఇరాన్ అసెంబ్లీ నిపుణుల బృందం ఎన్నుకుంది.

-మిగతా 2 లో

## మహారాష్ట్రలో కొత్త త్రీ వీలర్ ఆటోలు నిషేధం

- రోడ్ల సామర్థ్యం మించడమే కారణమని ప్రకటించిన ప్రభుత్వం
- ముంబైలో రికార్డు స్థాయి ట్రాఫిక్: కిలోమీటరుకు 2,648 ఆటోలు
- వాయు కాలుష్యం, పార్కింగ్ కష్టాలను తగ్గించేందుకే ఈ నిర్ణయం
- ప్రస్తుత ఆటో డ్రైవర్ల ఆదాయం పెంచడమే లక్ష్యం: మంత్రి ప్రతాప్ సర్నాయక్
- మెట్రో, ఎలక్ట్రిక్ బస్సులపైనే ఇక సర్కార్ ఫోకస్

**న్యూఢిల్లీ**
మూడు చక్రాల ఆటోరిక్షాలపై మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త ఆటోరిక్షాలకు అనుమతుల మంజూరును నిలిపివేసింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ ప్రకటించారు. తాజా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా దీనిపై ప్రకటన చేశారు. రాష్ట్రంలో మూడు చక్రాల ఆటోరిక్షాలు సంతృప్త (గరిష్ట) స్థాయికి చేరుకున్నాయని, అందువల్ల నగరాల్లోని రోడ్ల సామర్థ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని కొత్త ఆటోలకు అనుమతుల మంజూరును నిలిపివేశామని ప్రభుత్వం తెలిపింది.2025-26 రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం మహారాష్ట్రలో 1.3 మిలియన్లు (12.96 లక్షలు) రిజిస్టర్డ్ త్రీ వీలర్ ఆటోలున్నాయి. ముంబై మెట్రో నగరంలోనూ అధికంగా ఆటోలున్నాయి. గరిష్ట స్థాయిని మించిపోయాయి. ముంబైలో సగటున ఒక కిలోమీటర్‌కు 2,648 ఆటోలు రోడ్లపై

-మిగతా 2 లో



## జర్నలిజం గొప్ప ఫీల్డ్

**వ్యవస్థను గాడిలో పెట్టేది జర్నలిస్టులే**



- అధికారం లేకున్నా.. అజమాయిషీ ఉంది : పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని వెల్లడి

**నిజామాబాద్ మార్చి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రతి ఒక్క రాజకీయ నాయకుని ఎదుగుదలలో జర్నలిస్టుల భాగస్వామ్యం ఉంటుందని, నాయకులు సరిగ్గా పనిచేయకున్నా.. వ్యవస్థను గాడిలో పెట్టాలన్నా.. సరి చేయాలన్నా.. ఆ పవర్ జర్నలిజానికే ఉందని, అందుకే జర్నలిజం గొప్ప ఫీల్డ్ అని పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం ఈ-పేపర్, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా అంటూ మీడియా అభివృద్ధి చెందుతూ కొత్త పుంతలు తొక్కుతున్నా.. తెల్లారి లేచి నాలుగైదు పేపర్లు చదవడంలోనే తనకు

-మిగతా 2 లో

## వనజీవి రామయ్య పేరిట పల్లె ప్రకృతి వనం ప్రారంభం

**రూ.40 లక్షల విలువైన భూమిని విరాళంగా ఇచ్చిన దాదాయిపల్లి సర్పంచ్ నర్సింహారావు దేశ్‌పాండే**





**రాష్ట్రంలోని అన్ని పల్లె ప్రకృతి వనాలకు వనజీవి రామయ్య పేరు పెట్టాలని విజ్ఞప్తి**






**మెదక్, మార్చి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా టేక్మల్ మండలం దాదాయిపల్లి గ్రామంలో ప్రకృతి పరిరక్షణకు ప్రతీకగా "వనజీవి రామయ్య పల్లె ప్రకృతి వనం"ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్ ప్రజాపతి ముఖ్య అతిథిగా పాల్గొని వనాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణకు గ్రామ స్థాయిలో అవగాహన పెంచే లక్ష్యంతో ఈ వనం ఏర్పాటు చేయడం విశేషం.గ్రామ సర్పంచ్ నర్సింహారావు దేశ్‌పాండే రూ.40 లక్షల విలువైన తన స్వంత భూమిని ఈ ప్రకృతి వనం కోసం కేటాయించడం కార్యక్రమానికి ప్రత్యేకత తీసుకొచ్చింది. వనజీవి రామయ్య ప్రకృతి ప్రేమకు గుర్తుగా ఈ వనాన్ని ఏర్పాటు చేయడం గ్రామ ప్రజల్లో స్ఫూర్తిని నింపిందని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిడిగొండ నరేష్ ప్రజాపతి మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వర్గీయ వనజీవి రామయ్య పర్యావరణ పరిరక్షణలో చేసిన సేవలు అపారమని అన్నారు. రాష్ట్రంలోని అన్ని పల్లె ప్రకృతి వనాలను "వనజీవి రామయ్య పల్లె ప్రకృతి వనాలు"గా నామకరణం

-మిగతా 2 లో

## ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రభావం

మొదటి తరువాయి

యుద్ధం నేపథ్యంలో 70 రోజుల వరకు గ్యాస్ సరఫరాకు గ్యాస్ కంపెనీలు హామీ ఇచ్చాయని, కానీ అందుకు విరుద్ధంగా గ్యాస్ సరఫరా చేయడం లేదని ఆ ప్రకటనలో తెలిపింది. అందుకే ఈ నెల 10వ తేదీ నుంచి రెస్టారెంట్లు, హోటళ్లను మూసివేస్తున్నట్లు పేర్కొంది.

## బంగ్లాదేశ్‌లో దారుణం

మొదటి తరువాయి

తెలిపింది. హత్యకు గురైన బాలుడు శాంతో కుమార్ సాహాగా పోలీసులు గుర్తించారు. అక్కడి మీడియా కథనం ప్రకారం.. మియాజీ ఫిల్లింగ్ స్టేషన్ ముందు ఆటోలో ప్రయాణికుడి కోసం శాంతో ఎదురుచూస్తుండగా.. కొందరు దుండగులు అతడిపై దాడిచేసి, ఆటోను లాక్కునే ప్రయత్నం చేశారు. శాంతో వాళ్లను ప్రతిఘటించడంతో హైవే పక్కన ఉన్న కల్వర్టు కిందకి తోసేశారు. అయినా వెంటనే తేరుకుని దొంగలను వెంబడించిన శాంతోను వారు హత్యచేశారు. రోడ్డుపై వేగంగా వస్తున్న వాహనం కిందకి శాంతోను తోసేశారు. దాంతో ఆ వాహనం ఢీకొని బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. రాత్రి వరకు బాలుడి ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు గాలిస్తుండగా.. తెలిసిన ఆటో డ్రైవర్ ద్వారా సమాచారం అందినట్లు శాంతో బంధువులు తెలిపారు. శాంతో ప్రయాణికులను ఎక్కించుకున్న ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తే నిందితులను గుర్తించే అవకాశం ఉందని అతడి కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఇఫ్తార్ సమయంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని ఆసరాగా తీసుకుని దుండగులు బాలుడిని టార్గెట్ చేసి, ఆటోను ఎత్తుకెళ్లారని రోపించారు. బంగ్లాదేశ్‌లో కొత్తగా ఏర్పడిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రభుత్వ హయాంలోనూ హిందూ వర్గాలపై దాడులు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో మహమ్మద్ యూనస్ పాలనలోనూ మైనారిటీలపై వరుసదాడులు జరిగాయి.

## మహారాష్ట్రలో కొత్త త్రీ వీలర్ ఆటోలు నిషేధం

మొదటి తరువాయి

తిరుగుతున్నట్లు ఆర్టీవో డాటా తేల్చింది. ఇది ఇండియాలోని అన్ని మెట్రో నగరాలకంటే అత్యధికం. ముంబై చుట్టుపక్కల ప్రాంతాల్లోనే 2.5 లక్షల ఆటోలు ఉన్నాయి. దీంతో నగరంలో 'లేన్ టు వెహికల్' స్థాయి మించిపోయింది. పార్కింగ్‌కు కూడా సమస్యలొస్తున్నాయి. ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. పర్యావరణానికి కూడా హాని కలుగుతోంది. ఇప్పటికే ముంబైలో వాయు కాలుష్యం ఎక్కువైంది. ప్రస్తుతం ఏక్యూఐ 170-200 వరకు ఉంది. ఇది అనారోగ్య స్థాయి. సగటున 50-100 వరకు ఉండాలి. సీఎన్‌జీ ఆటోలతో కూడా ఎక్కువ వాయు కాలుష్యం అవుతోంది. ఈ నేపథ్యంలోనే కాలుష్యాన్ని తగ్గించేందుకు ముంబై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మెట్రో కారిడార్ పెంపు, ఎలక్ట్రిక్ బస్సులవైపు దృష్టిసారించింది. అలాగే కొత్త ఆటోలకు అనుమతి నిరాకరించింది. ఈ చర్యల వల్ల ట్రాఫిక్ తగ్గడం, కాలుష్యం తగ్గడంతోపాటు ఆటో రిక్షా నడిపే వారి ఆదాయం కూడా పెరుగుతుంది. అలాగే ఆటోలకు సంబంధించి సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించే వీలుంటుంది. కొత్త ఆటోలు రాకపోవడంతో ఇప్పుడున్న వాటి ద్వారా డ్రైవర్లకు మెరుగైన ఆదాయం లభిస్తుంది.

## ఇండస్ట్రీలకు అనుగుణంగా నైపుణ్యాలు

మొదటి తరువాయి

ఆధునిక కోర్సులను ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. యువతకు ఆధునిక నైపుణ్యాలు పెంచి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, అధికారులు, ట్రైనర్లు పాల్గొన్నారు. ఏటీసీ మరియు ఐటీఐ విద్యార్థులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు.

సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ఈ ప్రణాళికలో తీసుకున్న నిర్ణయాలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన యువత అందుబాటులో లేరని అనేక పరిశ్రమలు చెబుతున్నాయని, అందుకే ఇండస్ట్రీలకు అవసరమైన స్కిల్ సెట్స్పై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఏటీసీలు, ఐటీఐలు భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన శిక్షణ పొందిన నిపుణులను తయారు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ÷ఠిటి ప్రపంచంలో ఒక్క నైపుణ్యం సరిపోదని, యువత మల్టీ స్కిల్డ్ ఉంటేనే అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ఏటీసీల నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణా విధానం ఉండాలని ప్రిన్సిపాల్స్‌కు సూచిస్తున్నామని చెప్పారు. ÷-రామీణ ప్రాంతాల్లో టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన కోర్సులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రపంచంతో పోలిస్తే వ్యవసాయ రంగంలో మన ఉత్పాదకత తక్కువగా ఉన్నందున అగ్రి అలైడ్ సెక్టార్‌లో నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ÷ఖనోమ్ వ్యాలీ ప్రాంతంలోని పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అక్కడి పరిశ్రమలకు అవసరమైన కోర్సులను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. ÷ుద్యార్థులు జీవితంలో విజయాన్ని సాధించాలంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలని, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

## జర్నలిజం గొప్ప ఫీల్డ్

మొదటి తరువాయి

తృప్తి ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం నగరంలోని బస్వాగార్డెన్‌లో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించగా ఆయన హాజరై ప్రసంగించారు. ఎన్ఎస్‌యూఐ విద్యార్థిసంఘంలో ఉన్నప్పుడు ఏదైనా కార్యక్రమం నిర్వహిస్తే.. తెల్లారి పేపర్ కోసం ఆసక్తిగా ఎదురుచూసేవాళ్లమని, వార్త క్లిప్పింగ్‌లను కట్ చేసుకుని దాచుకునే వారమని అన్నారు. దూరదర్శన్‌లో చిన్న క్లిప్పింగ్ వచ్చేందుకు నానా తంటాలు పడేవారమని.. ఎమ్మెల్యేలతో ప్రయత్నించి న్యూస్ వస్తే ఆనందించే వాళ్లమంటూ నాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. నాయకులకు, జర్నలిస్టులకు అవినాభావ సంబంధం ఉంటుందన్న మహేశ్‌గౌడ్.. తన ఎదుగుదలలో జర్నలిస్టులు కీలకంగా పని చేశారని గుర్తించారు. రాజకీయాలు కరప్షన్, దోపిడీ అన్నట్టు పలువురు వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిని గాడిలో పెట్టే బాధ్యత సైతం జర్నలిస్టులదే అని అన్నారు. ఎల్లో జర్నలిజం కాకుండా వాస్తవాలు రాయాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చే బాధ్యత జర్నలిస్టులదని, వాటిని సరిదిద్దే బాధ్యత తమదని తెలిపారు. ప్రస్తుతం పలువురు జర్నలిస్టులకు వేతనాలు వచ్చే పరిస్థితి లేదని, కష్టపడితేనే పూటగడిచే పరిస్థితులు ఉన్నాయని, అందుకే జర్నలిస్టుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల చిరకాలవాంఛ అయిన ఇండ్ల స్థలాలు కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం సీఎంతో మాట్లాడి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు గల నియమ నిబంధనలు, సుప్రీం తీర్పులు పరిశీలిస్తామని, ఖాళీ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో కలెక్టర్, ఆర్డీవోతో సమావేశం నిర్వహించి ఆరా తీస్తామని అన్నారు. అంతకుముందు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, డా.భూపతిరెడ్డి, మేయర్ కూరగాయల ఉమారాణి తదితరులు మాట్లాడారు. వెల్‌నెస్ ఆస్పత్రిలో జర్నలిస్టులకు, వారి కుటుంబీకులకు ఉచిత ఐపీ, ఓపీ సేవల కోసం రూపొందించిన హెల్త్‌కార్డులను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

# భారీగా బడ్జెట్ పద్దు

(మొదటి తరువాయి)

మొదటి రోజు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. 20న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) బడ్జెట్‌కు సంబంధించి భారీగా పద్దును కేటాయించే అవకాశమున్నది. ఈసారి రాష్ట్ర బడ్జెట్ రూ.3.15 లక్షల కోట్లు ప్రతిపాదించాలని భావిస్తున్నది. గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. ప్రపంచ దేశాల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులను ఆహ్వానించింది. అయితే 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమి, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమిని లక్ష్యంగా నిర్దేశించుకుంది. అంటే ప్రస్తుతం రూపాయికి డాలర్ విలువను బట్టి 2034 నాటికి రూ.92.35 లక్షల కోట్లు, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేండ్లు పూర్తయ్యే 2047 నాటికి రూ.277 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలని భావిస్తున్నది. అయితే ఆచరణలో ఇది ఏ మేరకు సాధ్యమ వుతుందో అన్నది వేచిచూడాల్సిందే. అయితే అందుకోసం కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి (క్యూర్), పెరి అర్బన్ రీజియన్ ఎకానమి (ప్యూర్), రూరల్ అండ్ అగ్రి రీజియన్ ఎకానమి (రేర్) ప్రణాళికలను రూపొందించింది. ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నది. అందులో భాగంగా రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, రోడ్ల అనుసంధానం, రైళ్ల విస్తరణ, కొత్త విమానాశ్రయాలను నెలకొల్పడం, పరిశ్రమల స్థాపన, ఉద్యోగావకాశాలను పెంచడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకుంది. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నది.

**హైదరాబాద్‌కు బడ్జెట్‌లో ప్రాధాన్యత**

క్యూర్‌లో ఉన్న హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. నగరంలో ఉన్న పరిశ్రమలను ప్యూర్, రేర్ మధ్యలో నెల కొల్పేలా ప్రణాళికలను రూపొందిం చింది. అందుకోసం పరిశ్రమల యాజమాన్యాలతో సంప్రదింపులు చేస్తున్నది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని మూడు కార్పొ రేషన్లుగా విభజించింది. త్వరలోనే జీహెచ్ఎంసీతోపాటు వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లకు ఎన్నికలు రాబోతున్నాయి. హైదరాబాద్ మహానగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ కేటాయింపులు చేసే అవకాశమున్నది. మెట్రో రెండో దశ విస్తరణ, రోడ్ల నిర్మాణం, తాగునీరు, పారిశు ధ్యం, మౌలిక వసతులు, డబుల్ బెడ్రూం ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వాటికి ప్రాధాన్యత ఇవ్వనుంది. 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇద్దరు కార్పొరేటర్లను మాత్రమే గెలిచింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో జీహెచ్ఎంసీ మేయర్ పీఠాన్ని సొంతంగా గెలవాలని భావిస్తున్నది. అందుకే రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్‌కు ప్రాధాన్యత ఇచ్చే అవకాశ మున్నది. ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వాటికి కూడా నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తున్నది.

# అప్‌గ్రేడ్ అవ్వండి

(మొదటి తరువాయి)

కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథి పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తు సవాళ్లు, సాంకేతికత వినియోగం, చట్టాల మార్పు, సిబ్బంది హేతుబద్ధీకరణ తదితర కీలక అంశాలపై ఉన్నతాధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

**నేరాల స్వరూపం మారింది..**

ఒకప్పుడు రాష్ట్రంలో తీవ్రవాద సమస్య ఎక్కువగా ఉండేదని, దాన్ని ఎదుర్కొనేందుకు అప్పట్లో ఎస్ఐబీ, గ్రేహౌండ్స్, అవినీతి నియంత్రణకు ఏసీబీ తదితర వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నామని సీఎం గుర్తుచేశా రు. కానీ, ఇప్పుడు ప్రపంచంలో వచ్చిన మార్పులకు పాత వ్యవస్థలు, పాత పోలీస్ మాన్యువల్ సరిపోవడం లేదని అభిప్రాయపడ్డారు. సైబర్ క్రైం, డ్రగ్స్ సరఫరా, డార్క్‌వెబ్‌సైట్ వంటి నేరాలను అరికట్టేందుకు డిజిటల్ ఎవిడెన్స్, సాంకేతిక నైపుణ్యంపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు.

**కొత్త చట్టాలకు సీఎస్ కమిటీ**

నార్కోటిక్స్, సైబర్ క్రైమ్‌ల కట్టడికి కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలను చట్టరూ పంలోకి తెచ్చే క్రమంలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాల మధ్య ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకు ండా చూసుకోవాలన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఆధ్వర్యంలో ఒక ఉన్నతస్థా యి కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు.

**మెగా డేటా సెంటర్.. సిబ్బంది రేషనలైజేషన్**

ప్రస్తుతం చిన్న జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో జనాభా ప్రాతిపదికన పోలీసుల కేటాయింపులు జరగాల్సి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మానవ వనరుల సద్వినియోగంలో భాగంగా డీజీపీ తక్షణమే సిబ్బంది రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడ నేరం జరిగినా ఆ సమాచారాన్ని బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో నిక్షిప్తం చేసేలా ఒక 'మెగా డాటా సెంటర్'ను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్ మహానగరం భవిష్యత్తు అవసరాల కోసం వచ్చే 25 ఏండ్లకు సరిపడా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని తెలిపారు.

**పనితీరు ఆధారంగానే పోస్టింగ్‌లు.. 'మన్ కీ బాత్' వద్దు!**

అధికారుల పనితీరు ఆధారంగా ఏ, బీ, సీ క్యాటగిరీలుగా వర్గీకరించి, ఆ డేటా ఆధారంగానే వారికి పోస్టింగ్‌లు ఇస్తున్నట్టు సీఎం వెల్లడించారు. ఉన్నతాధికారులు 'సూపర్ బాస్'లమనే ఫీలింగ్ పక్కనపెట్టి కింది స్థాయి సిబ్బందికి చేరువ కావాలన్నారు. పోలీసింగ్‌లో 'హ్యూమన్ టచ్' చాలా ముఖ్యమన్నారు. 'మన్ కీ బాత్'ను ఉద్దేశించి పరోక్షంగా ప్రస్తావిస్తూ.. అందులో చెప్పేది ఒక సైడే వినాల్సి ఉంటుందని, మనం చెప్పేది ఉండదని వ్యాఖ్యానించారు.

# ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనీ ఎంపిక

(మొదటి తరువాయి)

ఇందులో 88 మంది ఇస్లాం మత గురువులు ఉంటారు. వీరందరూ కలిసి ఆదివారం సమావేశమై కొత్త సుప్రీం లీడర్ కోసం చర్చ జరిపారు. మెజారిటీ సభ్యులు మొజ్తాబా వైపు మొగ్గు చూపారు. కొందరు సభ్యులు వారసత్వ నాయకత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ.. మెజారిటీ ఉండటంతో మొజ్తాబానే ఎన్నుకున్నారు. ఒకవైపు ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొత్త లీడర్ ఎంపికను ఇరాన్ పూర్తి చేసింది. అతడు, ఎప్పటినుంచి బాధ్యతలు స్వీకరిస్తారో తెలియరాలేదు. మొజ్తాబాకు విదేశాల్లో భారీగా ఆస్తులున్నాయి. అతడికి లండన్‌లో దాదాపు 2,500 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అంచనా. కెన్సింగ్‌టన్ ప్యాలెస్‌లో అతడికి ఖరీదైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 2014 నుంచి లండన్‌లో ఆస్తులు కలిగి ఉన్నాడు. అక్రమ చమురు అమ్మకాల ద్వారా ఇదంతా సంపాదించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఇటీవలి పరిణామాల నేపథ్యంలో లండన్‌లోని అతడి ఆస్తులపై ఇజ్రాయెల్, అమెరికా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అతడి ఆస్తులకు భద్రతాపరమైన ముప్పు ఉందని నిపుణులు అంచనావేస్తున్నారు. మరోవైపు మొజ్తాబా ఎంపికను అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేముందు తమ అనుమతి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అలాగే కొత్త లీడర్ ఎవరైనా సరే అంతం చేస్తామని ఇజ్రాయెల్ ఇదివరకే ప్రకటించింది.

# వనజీవి రామయ్య పేరిట పల్లె ప్రకృతి వనం ప్రారంభం

(మొదటి తరువాయి)

చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వనజీవి రామయ్య ప్రేరణతో వాస్విక్ ఫౌండేషన్ రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లో వేలాది మొక్కలను నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోందని తెలిపారు. ఆయన జీవిత చరిత్రను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో పుస్తకరూపంలో తీసుకువచ్చి పాఠశాలలు, గ్రంథాలయాలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే ఆయన జీవితంపై రూపొందించిన లఘు చిత్రం తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే ప్రతిష్టాత్మక "తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్"కు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఇలాంటి స్ఫూర్తిదాయక కార్యక్రమానికి తన స్వంత భూమిని కేటాయించిన సర్పంచ్ నర్సింహరావు దేశ్‌పాండేను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, ప్రసన్న కుమార్, ఇన్స్పెక్టర్ రేణుక రెడ్డి, గ్రామ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉన్నావ్ బాధితురాలి వాదనలు విననున్న సుప్రీం

**న్యూఢిల్లీ**

తన వాదనలు వినిపించేందుకు ఉన్నావ్ అత్యాచార బాధితురాలికి గల హక్కును సుప్రీం కోర్టు సోమవారం గుర్తించింది. అమెపై అత్యాచారం జరిపిన నిందితుడు, బిజెపి మాజీ ఎంఎల్ఎ సెంగార్‌కు బెయిల్‌ను సవాలు చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను బాధితురాలిని కూడా ఒక పక్షంగా చేర్చాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బగ్చిలతో కూడిన సుప్రీం బెంచ్ ఆదేశించింది. అయితే తన ప్రాణానికి ముప్పు వుందంటూ బాధితురాలి కజిన్, మైనర్ అయిన బాలుడు పెట్టుకున్న దరఖాస్తును సుప్రీం బెంచ్ విచారించలేదు. సిబిఐ పిటిషన్‌తో కలిపి విచారించాలని కోరడానికి బదులుగా స్వతంత్ర లీగల్ పరిష్కారాన్ని దరఖాస్తుదారుడు కోరాలని సూచించింది. అయితే సిబిఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేసు వాయిదాను కోరడంతో ఇక కేసు అర్హతలను కోర్టు పరిశీలించలేదు. తన క్లయింట్‌పై ఈ అఘాయిత్యం జరిగినపుడు ఆమెకు కేవలం 15ఏళ్ళని, ఆమెకు తాము జవాబుదారీగా వున్నామంటూ బాధితురాలికి న్యాయం జరగాలని సిబిఐ కోరుతోంది.



# పెంచిన గ్యాస్ ధరలపై సిఐటియు నిరసన

**కొండపాక, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పేద, మధ్యతరగతి ప్రజలపై భారంగా మారిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు.సిఐటియు కొండపాక మండల కమిటీ ఆధ్వర్యంలో వెలికట్ల గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఖాళీ గ్యాస్ సిలిండర్‌తో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.115 పెంచడం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార ధరలు పెరిగి ప్రజలపై అదనపు భారం పడుతోందని, గృహ వినియోగ గ్యాస్ ధరను రూ.60 పెంచడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.గ్యాస్ ధరల పెరుగుదలతో అన్ని వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా



సామ్రాజ్యవాదానికి లొంగి దేశ స్వతంత్ర విధానాలకు భంగం కలిగిస్తోందని, ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రపంచ శాంతి కోసం అలీన విధానాన్ని అమలు చేసి యుద్ధాలను ఆపేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.ఈ నిరసనలో సిఐటియు జిల్లా నాయకులు బర్మ కొమురయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొమురవెల్లి కనకయ్య, బంగారి లచ్చవ్వ, అమ్ముల మల్లవ్వ, అమ్ముల పద్మ, అమ్ముల నరసవ్వ, మెరుగు నర్సింలు, దొమ్మాట ఎల్లయ్య, మహమ్మద్ అలీ, గంపల బాలయ్య, మెరుగు శివరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంలో నీటి శుద్ధి కేంద్రం



**పాలకుర్తి, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలోని నీటి శుద్ధి కేంద్రం గత రెండేళ్లుగా నిరుపయోగంగా మారడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పదిహేనేళ్ల క్రితం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో గ్రామస్తుల కోరిక మేరకు వాటర్ ప్లాంట్ నిర్మించారు. ఆ సమయంలో ప్లాంట్‌లో సమస్యలు తలెత్తినప్పుడు కంపెనీ స్వంత ఖర్చుతో మరమ్మత్తులు చేసి నీటిని అందించేది. అయితే, రెండేళ్ల క్రితం ప్లాంట్ రిపేరుకు వచ్చి మూలకు పడిపోయింది. అప్పటి నుండి అల్ట్రాటెక్ కంపెనీ మరమ్మత్తులు చేయకపోవడంతో ప్లాంట్ చుట్టూ అపరిశుభ్రత పెరిగింది. గ్రామస్థులు ఫిల్టర్ నీళ్లకు దూరమవ్వడంతో పాటు, ప్లాంట్ మూతపడిన ప్రదేశం మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ప్లాంట్‌ను మరమ్మత్తులు చేసి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విశ్వవిద్యాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ






**పాలకుర్తి, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పాలకుర్తి మండలం పుట్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు కస్తూర్బా గాంధీ బాలికల విశ్వవిద్యాలయాన్ని ఎంపీడీఓ శశికళ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ పరికరాలు, రికార్డులు, మందుల పంపిణీ విధానం, రోగులకు అందించే చికిత్స తీరును, హాస్పిటల్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా డాక్టర్లు సకాలంలో హాజరై ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆమె సూచించారు. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.తరువాత కస్తూర్బా గాంధీ బాలికల విశ్వవిద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భోజనం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి యు. సుదర్శన్, సర్పంచ్ తోట ప్రశాంత్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చిగురుమామిడి, సైదాపూర్ మండలాలపై ప్రత్యేక దృష్టి

**హుస్నాబాద్ , మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక విజయవంతం కావడంలో చిగురుమామిడి, సైదాపూర్ మండలాలు నంబర్ వన్‌గా నిలవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సోమవారం జరిగిన మండల స్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపని గ్రామాల్లో ఎంత పెద్ద పనైనా




చేసి పెడతానని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి వ్యక్తికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి పర్యవేక్షించాలని ఆయన సూచించారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ అధికారులు సమిష్టిగా కృషి చేసి కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేస్తామని తెలిపారు. గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు మిషన్ మోడ్‌లో పనిచేయాలని, నిధుల వినియోగంపై పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆర్డీవో కే. మహేశ్వర్, డిపిఓ జగదీశ్వర్, డిఆర్డిఓ శ్రీధర్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సంక్షేమ అధికారి సరస్వతి, హౌసింగ్ పిడి శ్రీనివాస్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వేల్పుల మహేందర్‌కు డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు--2026 నామినేషన్

**హుస్నాబాద్ , మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన విద్యావంతుడు, సామాజిక కార్యకర్త వేల్పుల మహేందర్‌ను డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు--2026 నామినేట్ చేసినట్లు బహుజన సాహిత్య అకాడమీ (బి.ఎస్.ఏ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది.వేల్పుల మహేందర్ ఎంఎస్సీ బోటనీ, ఎంఏ తెలుగు సాహిత్యం, ఎంఈడ్ విద్యలను పూర్తి చేసి ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా సేవలందిస్తున్నారు. తన రచనలు, వ్యాసాల ద్వారా సమాజంలో అవగాహన కల్పిస్తూ సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేస్తున్నారు.బి.ఎస్.ఏ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన వారిని గుర్తించి జాతీయ అవార్డులు ప్రదానం చేస్తున్నారు. ఈ సంవత్సరం మార్చి 15న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగే జాతీయ సాహిత్య సభలో




అవార్డులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది సాహిత్యవేత్తలు ఎంపికయ్యారు. సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం, ప్రజా సమస్యలపై నిరంతరం వ్యాసాలు రాయడం, ప్రజల్లో చైతన్యం కలిగించే ఆర్టికల్స్ ద్వారా సమాజానికి సేవలు అందిస్తున్నందుకు గుర్తింపుగా ఈ అవార్డు కోసం ఆయనను నామినేట్ చేసినట్లు బి.ఎస్.ఏ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, తెలంగాణ కోఆర్డినేటర్ హనుమండ్ల విష్ణు, సెలక్షన్ కమిటీ సభ్యుడు బాదె వెంకటేశం తెలిపారు.ఈ సందర్భంగా వేల్పుల మహేందర్ మాట్లాడుతూ, సమాజ చైతన్యానికి సంబంధించిన వ్యాసాలు రాయడానికి ఎప్పటికప్పుడు ప్రోత్సాహం అందించిన నీలగిరి ఎక్స్‌ప్రెస్ పత్రిక యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనను ప్రోత్సహించి ముందుకు నడిపించిన కషవేణి రాకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా సమాజానికి ఉపయోగపడే రచనలు కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు.

# మహిళా డిగ్రీ కళాశాలలో శుభ్రతా డ్రైవ్



**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో వరుసగా మూడవ రోజు శుభ్రతా కార్యక్రమం కొనసాగింది.విద్యార్థులు, అధ్యాపకులు కలిసి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నుండి లైబ్రరీ వరకు శుభ్రపరిచే పనులు చేపట్టారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన క్యాంపస్ వాతావరణాన్ని కొనసాగించడంలో సిబ్బంది, విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం ఈ కార్యక్రమంలో ప్రతిబింబించింది.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన వాల్గొండ సర్పంచ్ తోపారపు వసంత.

**మల్లాపూర్ : మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మండలం లోని వాల్గొండ గ్రామసర్పంచ్ తోపారపు వసంత కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ కార్యక్రమం లో వాల్గొండ తండా సర్పంచ్ ధరంసోత్ సురేష్, వార్డ్ సభ్యులు అభిషేక్, వీరేశం, రాజమణి, తిరుపతి నాయకులు కిరణ్ కుమార్, సతీష్, మురారి, ఉదయ్, సంజయ్, రణధీర్, రాజశేఖర్,భరత్ తదితరులు పాల్గొన్నారు



# తెలంగాణలో గో హత్య నిరోధక చట్టం అమలులో వైఫల్యం విహెచ్‌పి విమర్శ




**హైదరాబాద్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆధ్వర్యంలో గోరక్ష ప్రాంత సమావేశం కోటి లో జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారతీయ గోరక్ష సహ ప్రముఖ్ ఆకారపు కేశవరాజు మాట్లాడుతూ తెలంగాణలో గో హత్య నిరోధక చట్టం అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అక్రమ పశువధశాలలు రాష్ట్రంలో విస్తృతంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. గో మాఫియా దారులపై పీడీ యాక్ట్ అమలు చేయాలని, ఇప్పటి వరకు గోవుల అక్రమ రవాణాలో కేసులు బుక్ అయిన వాహనాలను సీజ్ చేయాలని విహెచ్‌పి డిమాండ్ చేసింది. బక్రీద్ సందర్భంగా గో హత్యలు జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు. హిందూ సమాజాన్ని చైతన్యం చేస్తూ గోమాత రక్షణ కోసం ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో క్షేత్ర గోరక్ష ప్రముఖ్ యాదగిరి రావు, ప్రాంత కార్యదర్శి లక్ష్మినారాయణ, సహ కార్యదర్శి రమేష్, ప్రాంత గోరక్ష ప్రముఖ్ సుభాష్ చందర్, ప్రాంత సహ ప్రముఖ్ రాజారాం, ఊటుకూరి రాధాకృష్ణ, రమేష్, స్వారాజ్యం, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్




**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో వారం రోజులపాటు జరిగిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిభ ఆధారంగా క్రీడల్లో రాణించే పరిస్థితి లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌సీఏలో పైరవీలు, డబ్బులు తీసుకుని సెలెక్షన్లు జరగడం వల్ల క్రీడాకారుల ప్రతిభ దెబ్బతింటోందని, ఈ దుస్థితికి చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో రాబోయే దశాబ్ద కాలానికి 'ఖేలో ఇండియా' మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మిషన్ ద్వారా క్రీడాకారుల ప్రతిభాభివృద్ధి, కోచ్‌లు, సహాయక సిబ్బంది వ్యవస్థాగత అభివృద్ధి, స్పోర్ట్స్ సైన్స్ ం టెక్నాలజీ సమీకరణతోపాటు పెద్ద ఎత్తున పోటీలు, లీగ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మార్చి 1 నుండి 7 వరకు జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు, జట్లకు బహుమతులను బండి సంజయ్ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్, డిప్యూటీ మేయర్ కొలగాని శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గుజ్జ శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రణాళికలో అందరూ భాగస్వామ్యులు కావాలి

**- ఎం.ఎస్. రాజ్ ఠాకూర్**




**గోదావరిఖని, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. గోదావరిఖనిలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన 5కే రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అద్భుతమైన పరిపాలన నడిపిస్తున్నారని, ప్రతి పల్లె, నగరంలో అభివృద్ధి సాధించి మహిళలందరికీ ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం 10 లక్షల కోట్లు అప్పు చేసినా, ప్రస్తుత ప్రభుత్వం ధైర్యంగా ఉద్యోగులకు జీతాలు ఇస్తూ సంక్షేమాన్ని ముందుకు నడిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇంటి తోపాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని, ఎవరో వస్తారని ఎదురు చూడకుండా కాలనీల సమస్యలను మనమే పరిష్కరించుకోవాలని సూచించారు. రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని పట్టణ ప్రజలతో మేయర్ మహంకాళి స్వామి ప్రతిజ్ఞ చేయించారు. యువత అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, శుభ్రత ప్రమాణాలను పాటిస్తూ తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మహిళలను గౌరవించాలి

**- కౌన్సిలర్ పాపిశెట్టి రాము**




**ఆమనగల్లు, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ప్రముఖ సంఘసేవకుడు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో మహిళా మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రేమ, త్యాగం, సహనం కలిస్తేనే మహిళ అని కొనియాడారు. మహిళలు పురుషులతో సమానంగా ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, కౌన్సిలర్లు ఎనుమల్ల రమేష్, నాగిళ్ల జగన్, కాలే యశోదమ్మ, నాయకులు శ్రీను నాయక్, కాలే విక్రమ్, మహిళా సంఘాల లక్ష్మీ, విజయ, స్వాతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు




**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) ఈకో క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే మునిసిపల్ పార్క్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈకో క్లబ్ కోఆర్డినేటర్, లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి డా. నల్ల మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే హానికర ప్రభావాలను వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పునర్వినియోగ పదార్థాలను ప్రోత్సహించడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించవచ్చని సూచించారు. కళాశాల అధ్యాపకులు అతియా సుల్తానా, రవళి కృష్ణ, డా. సుజాత, ప్రియాంక, రేఖారాణి, నారాయణ, యకంబరం, రమ్య, రాఖా, మౌనిక తదితరులు విద్యార్థినులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు పార్క్ పరిసరాల్లో ప్లాస్టిక్ చెత్తను సేకరించి శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని విద్యార్థినులు పిలుపునిచ్చారు.

# ఐటీఐలో షార్ట్ టర్మ్ కోర్సుల ప్రారంభం




**పెద్దపల్లి, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు చేతుల మీదుగా 6 షార్ట్ టర్మ్ కోర్సులు, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా 2 షార్ట్ టర్మ్ కోర్సులు ప్రారంభమయ్యాయి. అలాగే ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా కూడా నిర్వహించారు. ప్రిన్సిపల్ బుసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ కోర్సుల ద్వారా విద్యార్థులు త్వరగా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ మంత్రి గడ్డం వివేక్, ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, డైరెక్టర్ శ్రీమతి కాంతి వెస్లే కూడా ఈ కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఐటీఐకి అవసరమైన రా మెటీరియల్, ఇంటర్నల్ రోడ్లు, కాంపౌండ్ వాల్ పెంపు కోసం నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. మున్సిపల్ ఛైర్మన్ నుగిళ్ళ మల్లయ్య, వార్డ్ కౌన్సిలర్లు కమల్, సుధాకర్, హన్మంతు, ఐటీఐ సిబ్బంది మల్లికార్జున స్వామి, గైనీ శ్రీనివాస్, మహేందర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రానికి ఎస్బీఐ చేయూత




**పాలకుర్తి, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పాన్ ఇండియా సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి మండలం జీడి నగరంలోని అంగన్వాడీ కేంద్రానికి ఎస్బీఐ చేయూత అందించింది. బసంత్‌నగర్ స్టాఫ్ కాలనీలోని ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్ చంద్ర ఆధ్వర్యంలో టీవీ, వాచ్, గ్లాసులు, పుస్తకాలు, డ్రాయింగ్ పెన్నులు, వాటర్ టిన్నులు తదితర అవసరమైన వస్తువులను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శారద, మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మి రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఓట్స్ విధానంపై సర్దార్ రవీందర్ సింగ్ ఆగ్రహం

**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలో అమలు చేస్తున్న వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓట్స్) పథకాన్ని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేసి, మిగతా పట్టణాలను విస్మరించడం తీవ్ర అన్యాయమని కరీంనగర్ మాజీ మేయర్, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ మండిపడ్డారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిహెచ్ఎంసి పరిధిలో 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలపై మార్చి 31 వరకు 90 శాతం రాయితీతో పాటు 5 శాతం వడ్డీ మినహాయింపు కల్పించడం స్వాగతించదగ్గదే అయినా, అదే పథకాన్ని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లకు వర్తింపజేయకపోవడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని బయటపెడుతోందని ఆయన విమర్శించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో సుమారు 85 వేల ఇళ్లకు పైగా ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని, జిహెచ్ఎంసి తరహాలోనే రాయితీలు ఇస్తే వేలాది కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. జిహెచ్ఎంసికి ఒక న్యాయం... కరీంనగర్‌కు మరో న్యాయమా? కరీంనగర్ వేరే రాష్ట్రంలో ఉందా? అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లకు సమాన న్యాయం జరిగేలా ఓట్స్ పథకాన్ని కరీంనగర్ సహా ఇతర పట్టణాలకు కూడా వెంటనే విస్తరించాలని సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. పట్టణ ప్రజల సమస్యలను ప్రభుత్వం గంభీరంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

# 16న భవన నిర్మాణ కార్మికుల ధర్నా




**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈనెల 16న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలంగాణ బిల్డింగ్ అండ్ ఆధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. ముకుంద్ లాల్ మిశ్ర భవన్లో జరిగిన యూనియన్ ఆఫీస్ బేరర్ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కదిరే రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల రమేష్ మాట్లాడుతూ పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కారం, సి ఎస్ సి హెల్త్ టెస్టుల రద్దు, ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన నిధుల ఉపసంహరణ, 60 సంవత్సరాలు నిండిన వారికి రూ.10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలనే డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పెండింగ్ క్లెయిమ్స్ లబ్ధిదారులు, భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి వట్టి జగదీష్, జిల్లా ఉపాధ్యక్షులు జంబుకం వెంకన్న, రేణుకుంట సారయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రావుల ఎల్లయ్య, ఇజ్జగిరి సుధాకర్ పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ విద్యార్థులకు పెన్నుల పంపిణీ



**కొడిమ్యాల, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సోల్జర్ కి గన్ స్టూడెంట్ కు పెన్ను నినాదంతో తెలంగాణ శ్రీనివాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సరస్వతీ కటాక్షంలి పెన్నుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. చిలుకూరి బాలాజీ సుందరేశ్వర శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం మహరాజ్ సత్సంకల్పంతో కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, మొగిలిపాలెం శ్రీనివాస్, నాంపెల్లి శ్రీనివాస్, ఇజ్జగిరి శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, బండ శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనివాస్, చెన్న దేవరాజం, బల్ల అంజన్న, పాఠశాల ఫిజికల్ ట్రైనర్ బూట్ల రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో స్టైపెండ్ దోపిడీపై ఎస్ఎఫ్ఐ ఆందోళన




**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు చెల్లించాల్సిన స్టైపెండ్‌ల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్ మాట్లాడుతూ ప్రైవేట్ మెడికల్ కళాశాలలు విద్యాసంస్థలుగా కాకుండా కార్పొరేట్ సంస్థలుగా మారి విద్యార్థుల శ్రమను దోపిడీ చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు నిర్దిష్టమైన స్టైపెండ్ చెల్లించాల్సి ఉన్నప్పటికీ, అనేక కళాశాలలు నెలల తరబడి స్టైపెండ్ ఇవ్వకుండా విద్యార్థులను తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, పిడిఎస్యు రాష్ట్ర నాయకులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ఇది కేవలం ఆర్థిక దోపిడీ మాత్రమే కాకుండా యువ వైద్యుల భవిష్యత్తుపై దాడి అని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అన్ని ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో స్టైపెండ్ చెల్లింపులపై ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, బకాయిలను వెంటనే చెల్లింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిబంధనలు ఉల్లంఘిస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే విస్తృత ప్రజా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధమని సమావేశంలో పాల్గొన్న నాయకులు హెచ్చరించారు.

# మానసాదేవి ఆలయంలో అన్నదాన సత్రం నిర్మాణం





**గన్నేరువరం, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం ఖాసీంపేట గ్రామంలోని స్వయంభూ మానసాదేవి అమ్మవారి ఆలయానికి భక్తులు విరాళాలు అందిస్తున్నారు. కొమురవెల్లి గ్రామానికి చెందిన మంకాళి శ్రీనివాస్--స్వప్న దంపతులు రూ.2,16,000 నగదు విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, గుడి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ భక్తుల సహకారంతో నూతనంగా అన్నదాన సత్రం నిర్మాణం ముమ్మరంగా కొనసాగుతోందని తెలిపారు. ఒకేసారి వెయ్యి మందికి సరిపడే అన్నసత్రం భవనం నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు.

# జ్ఞాన భారతి ఏబీవీపీ నూతన భవన ప్రారంభం



**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్‌లో జ్ఞాన భారతి ఏబీవీపీ నూతన భవనాన్ని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిరుపేదల వైద్యానికి పెద్దపీట

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**కేశంపేట, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిరుపేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఆర్థిక ఇబ్బందులు ఎంత ఉన్నా విద్యా--వైద్య రంగాలకు తగిన ప్రాధాన్యత ఇస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో కేశంపేట మండల కేంద్రంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంకర్, గ్రామ సర్పంచ్ శాంత చేతుల మీదుగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రభుత్వం విద్యా--వైద్య రంగాలకు రాష్ట్రంలో పెద్దపీట వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది” అని అన్నారు. శిబిరంలో ప్రత్యేకత కలిగిన వైద్యులు డాక్టర్ అమృత మహిళలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఆరిఫ్‌ఖాన్ చిన్నపిల్లల వైద్య సేవలు అందించగా, డాక్టర్ ఉమామహేశ్వరి కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ సుష్మాశ్రీ ఎముకల వైద్య నిపుణురాలిగా, డాక్టర్ ప్రతిభ దంత వైద్య నిపుణురాలిగా, డాక్టర్ వీరప్రసాద్ జనరల్ మెడిసిన్ వైద్య నిపుణుడిగా సేవలు అందించారు. మొత్తం 60 రకాల పరీక్షలు నిర్వహించి, గర్భిణులు, చిన్నపిల్లలు, దంత సమస్యలు, కంటి చూపు, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందజేశారు. నిరుపేదలకు వైద్య సేవలు అందించిన సిబ్బందిని ఎమ్మెల్యే శంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాలా శ్రావణ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, స్థానిక వైద్యులు, హెల్త్ సూపర్వైజర్లు, స్టాఫ్ నర్సులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్ తో ఆవు మృతి



**దేవరకొండ మార్చి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్).**
నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోల్యా నాయక్ తండ గ్రామపంచాయతీకి చెందిన రామావత్ రాంచంద్ రైతు తన పొలంలో రోజు మాదిరిగానే కట్టేసిన ఆవు సోమవారం తెల్లవారుజామున ఉదయం ఐదున్నర గంటల సమయంలో వ్యవసాయ మోటార్ కు వచ్చే విద్యుత్ తీగను తగిలి ఆవు మృతి చెందింది. ఆవు సుమారు మార్కెట్ విలువల ధర ప్రకారంగా 70000 ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి విగ్రహ-ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



**బల్మూరు, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో విగ్రహం మరియు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి స్వామివారిని ప్రతిష్ఠించారు. ఈ మహోత్సవానికి ఆధ్యాత్మిక ప్రముఖ గురువులు శ్రీ రామానుజ చిన్న జీయర్ స్వామి, స్థానిక గౌరవ ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ వైభవాన్ని మరింతగా పెంచేలా ఈ మహోత్సవం నిర్వహించబడింది. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు, ప్రముఖులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు.

# ప్రజావాణి అర్జీలను వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు శ్యామ్‌ప్రసాద్‌లాల్, అమరేందర్, జిల్లా పరిషత్ సీఈఓ దేవసహాయం లతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు అందాయని, వాటిని పరిశీలించి సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అందరూ కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యాలయాల్లో ఫైళ్లను సక్రమంగా నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తూప్రాన్ మున్సిపాలిటీలో పర్యటించిన జిల్లా కలెక్టర్



**తూప్రాన్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ సోమవారం తూప్రాన్ మున్సిపాలిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి, మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. పట్టణ పరిశుభ్రత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజినీ రవీందర్‌రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు, ఆర్డీవో జయచంద్రరెడ్డి, ఎంఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇల్లులు, సీసీ రోడ్ల పనుల ప్రారంభం



**వేములపల్లి, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, సీసీ రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. లబ్ధిదారుల కలల ఇళ్లకు రూపకల్పనగా నిలిచిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ కేతవత్ శంకర్ నాయక్, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పార్టీ, ప్రజా సంక్షేమం కోసం పనిచేసే పార్టీ" అని వారు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పలు సీసీ రోడ్ల పనులను కూడా ప్రారంభించారు. గ్రామ శాఖ, మండల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని అభివృద్ధి పనులకు మద్దతు తెలిపారు.

# బాల్యం ఫోన్లకు బందీ కాకూడదు

## -- నీల రవీందర్



**షాద్‌నగర్, మార్చి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేటి డిజిటల్ యుగంలో సాంకేతికత అందిస్తున్న ప్రయోజనాల కంటే, అతిగా మొబైల్ ఫోన్ల వాడకం వల్ల పిల్లల భవిష్యత్తుపై పడుతున్న ప్రతికూల ప్రభావం ఆందోళన కలిగిస్తోందని సామాజిక కార్యకర్త నీల రవీందర్ పేర్కొన్నారు. ఇటీవల కర్ణాటక ప్రభుత్వం 16 ఏళ్ల లోపు పిల్లలకు మొబైల్ వినియోగంపై ఆంక్షలు విధించడం సానుకూల నిర్ణయమని, ఇదే దిశగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇది కేవలం మొబైల్ నిషేధం గురించి కాదని, పిల్లల శారీరక--మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన బాధ్యతాయుతమైన నియంత్రణ చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. చిన్న వయసులోనే సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ గేమింగ్‌లకు అలవాటు పడటం వల్ల ఏకాగ్రత లోపించడం, ఒంటరితనం పెరగడం వంటి సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన విధివిధానాలు రూపొందిస్తే తల్లిదండ్రులకు సరైన దిశానిర్దేశం లభిస్తుందని తెలిపారు. పిల్లలు మొబైల్ స్క్రీన్లకే పరిమితం కాకుండా మైదానాల్లో ఆడుకోవడం, పుస్తకాలు చదవడం వంటి సృజనాత్మక పనుల వైపు మొగ్గు చూపేలా ప్రభుత్వం ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా, అనవసరమైన ఇంటర్నెట్ వినియోగం నుండి వారిని రక్షించేలా సమగ్రమైన మార్గదర్శకాలు అవసరమని ఆయన విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావేత్తలు, మనస్తత్వ నిపుణులతో చర్చించి పిల్లల భవిష్యత్తు కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ మార్పు కేవలం చట్టంతోనే కాకుండా, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్

- మేడి పాపన్న వర్గం



**నాగర్‌కర్నూల్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎస్సీ సంక్షేమ పథకాల సాధనకై మాదిగ దండోరా పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కలకొండ యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సంతోష్‌కు సంక్షేమ పథకాల అమలుకై మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మాదిగ సమాజం 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తూ ఎస్సీ వర్గీకరణ విషయంలో విజయం సాధించినప్పటికీ ఆర్థిక, సామాజిక సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కుల ప్రకారం మనకు రావాల్సిన వాటా సాధించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా మాదిగల తలరాతలు మారలేదని, గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగా మిగిలిపోయాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరుద్యోగ రుణాల పేరుతో మాదిగలను మోసం చేసిందని వారు ఆరోపించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు లేకుండా చైర్మన్‌ను నియమించడం, దళిత అసైన్‌మెంట్ భూములు కనుమరుగవడం, నిరుద్యోగుల ఆశలు నెరవేరకపోవడం వంటి అంశాలను వారు ప్రస్తావించారు. ఈనెల 30న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో జరిగే నిరాహార దీక్షకు వేలాదిమంది తరలిరావాలని పిలుపునిచ్చారు. అప్పటివరకు ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు 15 కోట్ల రూపాయలు కేటాయించి బ్యాంకు రూటు లేకుండా రుణాలు ఇవ్వాలని, లేని పక్షంలో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కసిపాకుల రవికుమార్, దూల రామస్వామి, గడుసు రాజు, రాములు, కిరణ్‌కుమార్, వెంకటయ్య, జంగయ్య, పుష్పలత, సునంద, బాలు, వి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం పరిశుభ్రత--పరిశుద్ధ కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్‌చైర్మన్ బాదాం రమేష్‌లతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ స్వయంగా చీపురు పట్టి పాఠశాల ఆవరణలోని చెత్తను తొలగిస్తూ శుభ్రత పనులు చేశారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందుతాయని, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ పర్యావరణ పరిరక్షణపై చైతన్యం తీసుకురావాలని ఆయన అన్నారు. పాఠశాల పరిసరాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా మున్సిపల్ సిబ్బంది తరచుగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్ పనులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిధుల ద్వారా ఈ పనులకు అనుమతులు వెంటనే ఇవ్వాలని డిఆర్డిఓకు సూచించారు. మధ్యాహ్న భోజన కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు కిచెన్ షెడ్ త్వరగా పూర్తి కావాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయని, ఈ కార్యక్రమాల్లో ప్రజల సహకారం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ నిజాముద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి

- చైర్మన్ పత్యనాయక్



**ఆమనగల్లు, మార్చి 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా మున్సిపాలిటీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ సూచించారు. సోమవారం పట్టణ కేంద్రంలోని నర్సరీని ఆయన సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల స్థితిగతులు, నిర్వహణ విధానాన్ని అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పట్టణాన్ని పచ్చదనంతో అభివృద్ధి చేయడంలో నర్సరీలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. మొక్కలను సమృద్ధిగా పెంచి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# మధ్యాహ్న భోజనంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతపై జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆకస్మికంగా పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కామన్ డైట్ మెనూలో భాగంగా కిచిడీ, గుడ్డు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ ఇవ్వాల్సి ఉండగా, పాఠశాలలో మాత్రం వైట్ రైస్, గుడ్డు, సాంబార్ మాత్రమే వడ్డిస్తున్నట్లు కలెక్టర్ గమనించారు. వడ్డించిన అన్నం సరిగా వండకపోవడం, సాంబార్ పసుపు నీళ్ల లాగా ఉండటం ఆయనను తీవ్ర అసహనానికి గురి చేసింది. హెడ్‌మాస్టర్ భాస్కర్‌రెడ్డి, వంట సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "రోజూ పిల్లలకు ఇలాగే భోజనం పెడుతున్నారా? అన్నం ఎలా ఉంటుందో కూడా తెలియదా?" అంటూ ఉపాధ్యాయులను మందలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇలాంటి నిర్లక్ష్యం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతింటుందని కలెక్టర్ హెచ్చరించారు. కామన్ డైట్ మెనూను



తప్పనిసరిగా పాటించాలని, వంట ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షించాలని హెడ్‌మాస్టర్‌కు ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు హెడ్‌మాస్టర్, ఫుడ్ చెకింగ్ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్‌కు ఫోన్ ద్వారా ఆదేశించి, ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. అంతకుముందు పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షలకు కేవలం నాలుగు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, సమయాన్ని వృథా చేయకుండా ప్రతి పరీక్షకు భయం లేకుండా హాజరై మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం 128 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, ప్రీ ఫైనల్ పరీక్షల మార్కులను ఇప్పటివరకు ఎందుకు అందించలేదని హెడ్‌మాస్టర్‌ను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్‌చైర్మన్ బాదాం రమేష్, ఆర్డీవో సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ నిజాముద్దీన్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్‌బి సిప్రాజెక్ట్ పూర్తి చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం

-ఎస్ ఎల్ బి సి ప్రాజెక్ట్ ద్వారా దేవరకొండ కు 50,000 వేల ఎకరాలకు సాగునీరు.
-10కోట్ల రూపాయలతో 10,000మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వ్యవసాయ గోదాం.
-ఎమ్మెల్యే బాలు నాయక్.

**దేవరకొండ మార్చి 09. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలోని 11వ వార్డు శేరిపల్లి రోడ్డు రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ నిధుల నుండి మంజూరైన 10కోట్ల రూపాయలతో 10, 000మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నూతనంగా నిర్మించనున్న వ్యవసాయ గోదాం నిర్మాణ పనులకు రాష్ట్ర గిడ్డంగుల కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు , అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు మౌలిక వసతులు మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు మరియు వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సదుపాయం కల్పించడంలో ఈ గోదాం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయ





రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. గోదాం నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు దేవరకొండ పట్టణంలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. డిండి మండలంలోని ఎర్రరాం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కౌన్సిలర్లు, పట్టణ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం





వ్యాసరచన క్విజ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ నరేంద్ర చారి.

**ఎలిగేడు, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుల్తానాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ నరేంద్ర చారి మాట్లాడుతూ, రహదారి నిబంధనలపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించామని తెలిపారు. ట్రాఫిక్ నియమాలపై పట్టు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులు విధులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలి

-ఎంపీడీవో భాస్కర్‌రావు



వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తున్న మండల అభివృద్ధి అధికారి భాస్కర్ రావు పాల్గొన్న వార్డు సభ్యులు



**ఎలిగేడు, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల ఎన్నికైన నూతన వార్డు సభ్యులు తమ విధులు, బాధ్యతలు స్పష్టంగా తెలుసుకోవాలని మండల అభివృద్ధి అధికారి భాస్కర్‌రావు సూచించారు. ఎలిగేడు మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ప్రారంభమైన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డు సభ్యులు పంచాయతీలలో తమ బాధ్యతలను అవగాహన చేసుకుని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పేర్కొన్నారు. మహిళా సంక్షేమ శాఖ, సఖీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సేవలను వివరించి, గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాల్లో వార్డు సభ్యులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కిరణ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సూర్యకళ, డీడబ్ల్యూవో డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్లు అరుణ, శ్యామల, సుచిత్ర, ట్రైనర్లు సురేష్, శివ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపిడిఓ కి సన్మానం



**దేవరకొండ మార్చి 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణం లో మహిళా దినోత్సవం పురస్కరించుకొనిఎంపీడీవో పార్వతి కి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించిన అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు ఎర్ర ఆంజనేయులు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు మద్దిమడుగు బిక్షపతి గార్లు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ అన్ని రంగాల్లో ముందుకు నడుస్తున్న సందర్భం చాలా గణనీయం అన్ని రంగాల్లో మహిళలు వారి వారి ప్రతిభ కనబరుస్తూ రాజకీయాల్లో ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలలో వ్యాపారం అంతరిక్ష ప్రయోగాలలో, డాక్టర్లుగా, లాయర్లుగా, ఐఏఎస్ ,ఐపీఎస్ ,బిజినెస్ లో ముందు వరుసలో ఉన్నారని కొనియాడారు .ఎంపీడీవో పార్వతి కి శాలువాతో సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ సెక్రటరీ సుక్క ముత్తయ్య చంటి తదితరులు పాల్గొన్నారు.

# 5కె రన్ ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**షాద్‌నగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం పట్టణ ప్రధాన కూడలి వరకు 5కె రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించి, ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్‌చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, పురపాలక కమిషనర్ సునీతరెడ్డి, కౌన్సిలర్లు పెంటయ్య, మురళీమోహన్, అశోక్, కొప్పునూరి ప్రవీణ్, సుధీర్, శివ, గోపాల్, దిలీప్, శిరీష, సంతోషిబాయి, అరిఫ్‌బేగం, అనిత, రాజునాయక్, ముబారక్ అలీ ఖాన్, మధువల యాదవ్, జి.టి. శ్రీనివాస్, కరుణాకర్, అగ్గనూర్ నందు, జయప్రకాశ్, శ్రీకాంత్, ప్రదీప్ ముదిరాజ్, గంగమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు కూడా ఈ రన్‌లో ఉత్సాహంగా పాల్గొని, ప్రజాపాలన--ప్రగతి కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

# పిహెచ్ డి పట్టా పొందిన మాంసారం ప్రేమ్ కుమార్ దంపతులు



**దేవరకొండ మార్చి 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా,చందంపేట మండలం గాగిలాపురం గ్రామానికి చెందిన క్రైస్తవ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మరియు వ్యవస్థాపకులు ఓయూ ఉద్యమ నేత డాక్టర్ మాసారం ప్రేమ్ కుమార్, సతీమణి డాక్టర్ మాసారం అవంతిక మరియు ఇద్దరికీ పిహెచ్ డి పట్టా వచ్చిన సందర్భంగా తల్లిదండ్రుల, మరియు పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరికీ శాలువాతో సత్కరించి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేసిన చిన్న నాటి మిత్రుడు దేవరకొండ భీఆర్ఎస్ సోషల్ మీడియా గుండాల వెంకట్ యాదవ్. ఈ కార్యక్రమం లో నాగిళ్ల క్రిష్టఫర్ పాస్టర్ , మాజీ సర్పంచ్ మాసారం ఆనంద్ , విజయ్ , ఆనంద్ పాల్ , నిరంజన్, రాజు, చెన్నయ్య , శ్యామ్ కుమార్ , శివ, మరియు బంధుమిత్రులు పాల్గొన్నారు.

# ఈనెల 11న ఆదివాసి కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

- ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్



**ఆమనగల్లు, మార్చి 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఈనెల 11న గాంధీ భవన్లో ఆదివాసి కాంగ్రెస్ ఛైర్మన్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, వైస్ ఛైర్మన్ లింగం నాయక్ అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్ తెలిపారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని 621 మండలాల గాను ప్రతి మండలానికి 10 మంది చొప్పున సమావేశానికి రావాలని కృష్ణ నాయక్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల బహిరంగ సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ నెరవేర్చిన హామీలు.. ఇంకా నెరవేర్చాల్సిన హామీలపై చర్చించి నివేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు హాజరవుతున్నట్లు తెలిపారు. గిరిజన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కృష్ణ నాయక్ కోరారు. సమావేశంలో నాయకులు కండె సాయి, అబ్దుల్ అలీమ్, శ్రీను నాయక్, దుద్దు కృష్ణ యాదవ్, నాజర్, గౌస్, తోట శ్రీను, కుమార్ గౌడ్, కాలే శివ, గుద్దేటి శివ, హార్య నాయక్, రమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

# తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన




**ఆమనగల్లు, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తడి, పొడి చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ నాయక్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ పేర్కొన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో వారు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చెత్తను రోడ్లపై వేయకుండా ఇంటి వద్దే వేరు చేసి పంచాయతీ వాహనాలకు అందించాలని సూచించారు. చెత్తను వేర్వేరుగా అందించడం వల్ల కంపోస్ట్ ఎరువుగా మార్చుకోవచ్చని, పరిశుభ్రమైన గ్రామం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు జయందర్, నాయకులు భాస్కర్, రవీందర్, రమేష్, కిషోర్, శ్రీను, దాస్రు తదితరులు పాల్గొన్నారు.

# 17వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్ 17వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి, అధికారులకు చేరవేసే వారధిగా ఉంటూ, ప్రజలకు అందుబాటులో ఉండి, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్న వేముల కవిత చంద్రశేఖర్‌ను స్థానిక ప్రజలు అభినందించారు.

# అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12 వరకు కార్యచరణ రూపొందించామని, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో 99 రోజులపాటు సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లను పూర్తిగా పరిష్కరించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ శాఖల అధికారులు తమ పరిధిలోని అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని, వేసవిలో త్రాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకు, ఇతర నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై సత్వరమే పరీక్షించాలి

- కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి మొత్తం 169 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఏఓ రాజ్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కొత్త తరహాలో అక్రమ ఇసుక రవాణా పట్టివేత

**కరీంనగర్ రూరల్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్రమ ఇసుక రవాణాను కొత్త తరహాలో జరుపుతున్న వాహనాలను పట్టుకున్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన భేతి సునీల్ రెడ్డి, బొమ్మకల్ గ్రామానికి చెందిన ధోమ్మటి మల్లేశం, బండారి అరవింద్ తమ ట్రాక్టర్లలో మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి కరీంనగర్ వైపు తరలిస్తుండగా బొమ్మకల్ లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు. అదే విధంగా రాత్రి పూట తనిఖీల్లో అనుమానాస్పదంగా వస్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్‌ను పరిశీలించగా, వేములవాడకు చెందిన ఎర్రిల్లె సురేష్ తన యజమాని చొప్పరి శివప్రసాద్ ఆదేశాల మేరకు మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి, జల్లెడ పట్టి సన్నగా చెరిగి సంచుల్లో నింపి వాన్‌లో తరలిస్తున్నట్లు బయటపడింది. వాన్‌లో ఇసుక తరలిస్తే అనుమానం రాదని భావించి ఈ కొత్త తరహా అక్రమ రవాణా పద్ధతిని అవలంబించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దంచికొడుతున్న ఎండలు

- నిప్పులు కురిపిస్తున్న భానుడు
- నిర్మానుష్యంగా రోడ్లు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



**ఆమనగల్లు, మార్చి 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వారం రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. సూర్యుడి ప్రతాపంతో జనం విలవిలలాడుతున్నారు. 38 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ నమోదు అవడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. ఆమనగల్లు పట్టణంలో మధ్యాహ్నం 1గంటల నుంచి 4గంటల వరకు ఎండవేడిమితో రోడ్లన్ని నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆత్యవసర పరిస్థితుల్లో ముఖాలకు, తలకు రక్షణ కవచాలతో ప్రయాణికులు బయటకువస్తున్నారు. మరోవైపు ఎండలతో గిరాకీలు తగ్గిపోవడంతో వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు. వివిధ అవసరాలకు రోడ్లపైకి వచ్చిన జనం త్రాగునీరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కూల్ డ్రింక్స్, పండ్ల రసాల సేవించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు మధ్యాహ్నం సమయంలో బయటకు రావద్దని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని సూచిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటికి రాకుండా ఉంటే మంచిదని అన్నారు. ఎక్కువగా నీరు తాగాలని, దూరపు ప్రయాణాలు చేయకుంటే మేలని వైద్యులు సూచిస్తున్నారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- చైర్మన్ పత్యనాయక్,వైస్ చైర్ పర్సన్ గీత ఆచారి
- మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




**ఆమనగల్లు, మార్చి 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేమని వారు లేనిదే ప్రజారోగ్యం లేదని, కొవిడ్ సమయంలో ప్రాణాలను కూడా లెక్కచేయక విధులు నిర్వర్తించిన తీరు మరువలేనిదని మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య మహిళా కార్మికులకు శాలువాతో ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి తినిపించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చైర్మన్ పత్యనాయక్, వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికుల సేవలు లేకపోతే ప్రజల ఆరోగ్యం కుంటుపడుతుందన్నారు. పారిశుధ్య కార్మికుల స్వచ్ఛత కార్యక్రమాలతో అందరి ఆరోగ్యానికి ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. కొవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులను నిర్వర్తించి పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, కౌన్సిలర్లు సునీత ప్రశాంత్, ధోలి, నాగిళ్ళ జగన్, ఎర్రవోలు మహేష్, నిరంజన్ మరియు మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, మహిళా సంఘాల మహిళలు, పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాసవి వనిత ఏంజిల్స్ క్లబ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు




**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిట్టి మల్ల శ్రీను పుట్టినరోజు సందర్భంగా వాసవి వనిత ఏంజిల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద వైశ్యులకు రెండు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి మహాసభ అధ్యక్షులు కన్న కృష్ణ, క్లబ్ సభ్యులు రావికంటి భాగ్యలక్ష్మి, అధ్యక్షులు పల్లెర్ల విద్య, సెక్రటరీ గుండా శ్రీదేవి, ట్రెజరర్ కాచం రాజేశ్వర్, ఆకుల మెహర్, దిరిగేసాయి, తాటి పెల్లి సుభాష్, పల్లెల్లో రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-- మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ ,మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కోహెడ మండలం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజులపాటు ప్రజాపాలన--ప్రగతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో సమన్వయంతో అమలు చేసి ప్రజలకు మేలు కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, సంక్షేమ కార్యక్రమాలు, పిల్లల భద్రత, డ్రగ్స్‌కు నో, వ్యవసాయం, విద్య, యువత--క్రీడలు, మహిళా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి పది ముఖ్య అంశాలతో 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని మంత్రి పేర్కొన్నారు. వేసవికాలంలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాపాలన--ప్రగతి కార్యక్రమం దోహదం చేస్తుందని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంచార చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్





**హుస్నాబాద్ , మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చిగురుమామిడి మండల కేంద్రంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంచార చేపల విక్రయ వాహనాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముల్కనూర్ గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ--కొమురయ్య ఆధ్వర్యంలో లబ్ధిదారు పెసరి కవితకు వాహనాన్ని అందజేశారు.మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఈ సంచార చేపల విక్రయ వాహనం ద్వారా లబ్ధిదారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు మత్స్యకారుల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముల్కనూర్ ఉపసర్పంచ్ పైడిపల్లి వెంకటేష్, ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో పరిశుభ్రత కార్యక్రమం

**ఆమనగల్లు, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



అమన్‌గల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు పరిశుభ్రత కార్యక్రమం సోమవారం జరిగింది. కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి కళాశాల ఆవరణలో పరిసరాల పరిశుభ్రత, నీటి ట్యాంకులు, టాయిలెట్లు, త్రాగునీటి పరిశుభ్రత పనులను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములై పరిశుభ్రతకు తోడ్పడటంతో కార్యక్రమం విజయవంతమైంది.కార్యక్రమంలో అధ్యాపకులు రాజకుమార్, గోపాల్, శ్రీవాణి, నవనీత్, రాజు, హరీష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్




**కరీంనగర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్, రాంచంద్రాపూర్ ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు ఆక్రమణల విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి వినతిపత్రం ద్వారా తీసుకువెళ్లినట్లు మాజీ కార్పొరేటర్, అడ్వకేట్ ఎ.వి.రమణ తెలిపారు.ఈ అంశంపై మాజీ మేయర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ సునీల్‌రావు పత్రికల ద్వారా హెచ్చరికలు జారీ చేయడం ఆశ్చర్యకరమని, అభ్యంతరకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజా బాధ్యతతోనే ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లానని, వ్యక్తిగతంగా ఎవరినీ లక్ష్యం చేయలేదని స్పష్టం చేశారు. భగత్‌నగర్‌లోని మాజీ కార్పొరేటర్ కార్యాలయ నిర్మాణంపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రజా హక్కు అని, రిజిస్ట్రేషన్ ఉన్న ప్రతి డాక్యుమెంట్ చట్టబద్ధం కాదని, మున్సిపల్ అనుమతులు తీసుకుని నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని రమణ అన్నారు. సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకపోవడం ప్రజల్లో అనుమానాలు కలిగిస్తోందని పేర్కొన్నారు.మున్సిపల్ అధికారులు సాధారణ ప్రజలను సెట్‌బ్యాక్, అనుమతుల పేరిట వేధించడం, నిర్మాణాలు కూల్చడం జరుగుతుంటే, ప్రజాప్రతినిధులు స్వయంగా నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజల పరిస్థితి ఏమవుతుందో ప్రశ్నించారు.పత్రికల ద్వారా భయపెట్టే ప్రయత్నాలు చేస్తే ప్రజలు భయపడరని, సరైన ఆధారాలు ఉంటే అధికారుల ముందు ఉంచి నిజాయితీని నిరూపించుకోవాలని సవాలు చేశారు. అధికారులు స్పందించకపోతే బాధ్యత వారిపైనే ఉంటుందని ఎ.వి.రమణ హెచ్చరించారు.

## ఆక్రమిత ప్రభుత్వ భూములను

# పేదలకు పంచుతాము

- ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచుతామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.సోమవారం తిమ్మాపూర్‌లో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని తెలియజేయగా, రెవెన్యూ అధికారులు సర్వేలు జరిపి భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భూమిలేని నిరుపేదలకు ఆ స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు.ఆరోగ్య ఉపకేంద్రం వద్ద నీరు నిల్వ కాకుండా కాలువలు ఏర్పాటు చేయాలని, వీవో భవనాన్ని మే నెలాఖరుకల్లా పూర్తి చేసి, నీటి సౌకర్యం కోసం బోరు వెల్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.మహిళలకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పర్యాయాలు వడ్డీ లేని రుణాలు ఇచ్చిందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలను పట్టించుకోలేదని విమర్శించారు. తిమ్మాపూర్ గ్రామానికి ఇప్పటి వరకు 47 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మలి విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎండీఓ మల్హోత్ర, ఎంపీవో ప్రదీప్, గ్రామ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ పైడిపల్లి అంజిబాబు, వైద్యాధికారులు, పశు వైద్యాధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, వీవోఏలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తిని తీర్చేందుకు.. చలివేంద్రం ప్రారంభం



**రంగారెడ్డి జిల్లా , మార్చ్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ప్రారంభించడం అభినందనీయమని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి బిలకంఠి కిరణ్ కుమార్ గుప్త పేర్కొన్నారు.ఆర్యవైశ్య సంఘం, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మీర్పేట్ చౌరస్తా లో చలివేంద్రం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి బిలకంఠి కిరణ్ కుమార్ గుప్త ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు . ఈ సంద్భంగా బిలకంఠి కిరణ్ కుమార్ గుప్త మాట్లాడుతూ....మానవ సేవయే మాధవ సేవ అని భావించి ఆర్యవైశ్య సంఘం, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. చలివేంద్రం వల్ల ప్రయాణీకులు, బాటసారుల దాహార్తిని మండు వేసవిలో తీర్చడమనే సేవా కార్యక్రమం చేపట్టడం మహోన్నతమైన విషయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాళ్ల శ్రీనివాస్ గుప్త , శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ తెరెటిపల్లి శ్రీనివాస్ గుప్త , అధ్యక్షులు పచ్చిపులుసు శ్రీరామచంద్ర మూర్తి గుప్త , కోశాధికారి గందే వెంకటేశ్వర్లు గుప్త, బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మాజెటి మురళీధర్ గుప్త , కోశాధికారి ఆకుల బాలజంగయ్య గుప్త , కోర్ కమిటీ సభ్యులు, మహిళా విభాగం సభ్యులు మరియు ఆర్యవైశ్య సంఘం, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్

మంచన ప్రేమ్ కుమార్ గుప్త అధ్యక్షులు ,ఉప్పల రవీందర్ గుప్త ప్రధాన కార్యదర్శి గుడిపాటి శ్యామ్ ప్రసాద్ గుప్త , కోశాధికారి గందే వనజ మహిళా విభాగం అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

-కేసు వివరాలు వెల్లడించిన సిఐ పి.వెంకట్ రెడ్డి.



**దేవరకొండ మార్చి 09. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**

దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామం లోఫిబ్రవరి లో21 వి తేదీన ఇంటికి తాళం వేసి ఉన్న ఇళ్లను గమనించిన నిందితుడు యండి మోహాబుబ్ పాషా తండ్రి అబ్దుల్ ఖాదర్ వయస్సు 30 సంవత్సరాలు నివాసం నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి వృత్తి కారు డ్రైవర్ అనే అతను నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం లో తిరుగుతూ ఉంటూ పట్టణంలో వీలు కాదని పక్క గ్రామంలో మధ్యాహ్నం ఒకటికి రెండుసార్లు తన కారుతో తిరుగుతూ ఉండగా ఒక ఇంటికి మెయిన్ గేట్ కి లాక్ వేసిందగా గమనించి రాత్రి సమయంలో ఇంటికి పక్కన కారును పార్క్ చేసి పద్ధతి ప్రకారం ఇంట్లో ఉన్నటువంటి బంగారం ఆభరాణాలు అపహరించాడు.నిందుతుడి నుండి రికవరి సొమ్ము బంగారం 15 గ్రాములు, వెండి స్వాధీనం చేసుకున్నమని సిఐ పి.వెంకట్ రెడ్డి తెలిపారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
మంగళవారం 10 మార్చి 2026

# నవాబుపేట రోల్ మోడల్ కావాలి

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్ , మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో నవాబుపేట గ్రామం రోల్ మోడల్‌గా నిలవాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేసి, పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి హాజరు శాతం పెంచాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సమస్యల పరిష్కారానికి గ్రామస్తులంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక డ్రైవ్‌గా చేపట్టి విజయవంతంగా పూర్తి చేయాలని, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నవాబుపేట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే పశువైద్య ఉపకేంద్రం నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, డీఆర్‌డీఓ శ్రీధర్, ఆర్డీఓ మహేశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తహసీల్దారు రమేష్, గ్రామ సర్పంచ్ గూళ్ల రజిత రాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విల్లు విద్యలో గన్నేరువరం విద్యార్థుల ప్రతిభ



**గన్నేరువరం, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి మినీ నేషనల్ పోటీల్లో గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామానికి చెందిన తాడూరి హరిని పసిడి పతకం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. తాడూరి రవిచందర్ రెడ్డి--సునీతా దంపతుల కుమార్తె హరిని ఈ విజయంతో కరీంనగర్ జిల్లా పేరుతో పాటు గన్నేరువరం మండల ప్రతిష్టను రాష్ట్ర స్థాయి నుండి దేశవ్యాప్తంగా చాటింది. ఈ సందర్భంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, కలెక్టర్ స్థాయి అధికారులు హరినిని అభినందించారు.

## సోషల్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ



**హుస్నాబాద్ , మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండల కేంద్రంలోని సోషల్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థినులకు వడ్డిస్తున్న ఆహారాన్ని పరిశీలించిన మంత్రి స్వయంగా క్యూ లైన్‌లో నిలబడి ప్లేట్ తీసుకుని విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం కుక్‌లతో మాట్లాడి నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఆహారం విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ భోజనాన్ని పరిశీలించాలని పాఠశాల ప్రిన్సిపల్ విజయకు ఆదేశించారు. తరగతి గదులు, పరిసరాలు, డ్రింకింగ్ వాటర్ ట్యాంకులను పరిశీలించి మెయింటెనెన్స్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. టాయిలెట్లు, అదనపు గదుల కోసం షెడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, ఇతర తరగతుల సిలబస్ పూర్తయినందున రివిజన్ నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినులతో ముచ్చటించిన మంత్రి వారు పాటలు పాడడం, కథలు చెప్పడం చూసి అభినందించారు. ఇటీవల జరిగిన సర్వేలో కులం లేదా డబ్బు ప్రభావం కంటే విద్యతోనే కుటుంబాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. హుస్నాబాద్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో త్వరలోనే స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## మత్స్యకారుల ఫిర్యాదుపై కలెక్టర్ దృష్టి



**పెద్దపల్లి, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు చేపలు పట్టుకోనివ్వకుండా వెంకట్రావుపల్లి సర్పంచ్ భర్త మచ్చ యాదగిరి, అతని అనుచరులు ఆటంకం కలిగిస్తున్నారని, బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘం కార్యవర్గ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సెక్రటరీలు మాట్లాడుతూ వడ్కాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రిజిస్టర్ నంబర్ కె-156తో 150 మంది సభ్యులు ఉన్నారని, వడ్కాపూర్--వెంకట్రావుపల్లి గ్రామాల చెరువులు తమ పరిధిలో ఉన్నాయని తెలిపారు. చెరువుకు శిస్తు చెల్లిస్తూ జీవనోపాధి పొందుతున్నామని పేర్కొన్నారు. చేపలు పట్టుకోవడానికి వెళ్తే సర్పంచ్ భర్త లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఇవ్వకపోతే చెరువులో విషం కలిపి చేపలను చంపుతానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. మత్స్యకారుల హక్కులను కాపాడాలని, దౌర్జన్యం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కనకట్ల స్వామి, ఉపాధ్యక్షుడు జెట్టి సతీష్, సెక్రటరీ తీగల రమేష్, డైరెక్టర్లు, సభ్యులు సహా సుమారు 150 మంది మత్స్యకారులు పాల్గొన్నారు.

## రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులపై డిమాండ్



**అచ్చంపేట, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రైతు భరోసా నిధులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ. అచ్చంపేట పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు చింతల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లోనే రైతు భరోసా నిధులు విడుదల చేయాల్సి ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమని విమర్శించారు. భూమిలేని పేదలకు ప్రతి యేటా రూ.12,000 నగదు ఇస్తామని హామీ ఇచ్చి, రెండు సంవత్సరాల్లో కేవలం రూ.6,000 మాత్రమే ఇచ్చి ఇంకా రూ.18,000 ఇవ్వకపోవడం ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆయన అన్నారు. మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి, కేబినెట్ ఎజెండాలో మాత్రం రైతు భరోసా అంశం లేకపోవడం దారుణమని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని మార్చే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, ఉపాధి హామీ కింద ఏడాదికి 200 రోజుల పనులు కల్పించాలని, పని జరిగే ప్రదేశంలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు ఎస్.మల్లేష్, నాగరాజు, భాస్కర్, బాలస్వామి, శివరాము, జిల్లా ఉపాధ్యక్షులు వర్ధం సైదులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## గేదె దొంగిలించిన నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసు యంత్రాంగం



**కరీంనగర్ రూరల్ , మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నల్లగుంటపల్లి గ్రామానికి చెందిన విలాసాగరం స్వామి తన వ్యవసాయ భూమిలో కట్టివేసిన గేదెను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బొమ్మకల్ గ్రామ శివారులోని నేచర్ క్యూర్ హాస్పిటల్ వద్ద దొంగలించబడిన గేదెతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే దుర్శేడ్ గ్రామానికి చెందిన నేరేళ్ల ప్రవీణ్, మేడ మహేష్, మొగిలి శంకర్ మద్యానికి బానిసై సులువుగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో గేదెను దొంగలించి అమ్మి మద్యం సేవించాలని యత్నించినట్లు ఒప్పుకున్నారు. దొంగలించబడిన గేదె విలువ సుమారు రూ.55 వేలుగా ఉంటుందని రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా కొరతపై రైతుల ఆవేదన



**వంగూరు, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో యూరియా అందక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది డీలర్లు రైతుల పేరుతో దళారులతో కలిసి యూఫ్‌లో యూరియా బుక్ చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారని ఆరోపించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండపల్లి శ్రీనయ్య మాట్లాడుతూ పంటకాలం దాటిపోతున్నా యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. యూఫ్‌లో ఆన్లైన్ కాకుండా పాత పద్ధతిలోనే రైతులకు యూరియా అందించాలని ఆయన కోరారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వంగూరు మండలంలోని డీలర్ల షాపులపై మెరుపు దాడులు నిర్వహించాలని, లింకింగ్ పద్ధతిని ప్రోత్సహించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా యూరియా అమ్ముతున్న వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## మాదిగలకు రాష్ట్ర సలహాదారులుగా అవకాశం ఇవ్వాలని డిమాండ్



**అచ్చంపేట, మార్చి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సౌట కాశీం మాట్లాడుతూ మాదిగలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు లోక్‌సభ, రాజ్యసభ, శాసన మండలిలో ప్రాతినిధ్యం లేకపోవడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. మాదిగలు, ఉపకులాల గురించి ఏనాడు మాట్లాడని కడియం శ్రీహరికి మందకృష్ణ మాదిగను విమర్శించే హక్కు లేదని అన్నారు. మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని సౌట కాశీం హెచ్చరించారు.